Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 1

RNI. TGTEL/25/A1665


నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 67 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం 08.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపుకు కుట్ర

- సీఎం రేవంత్

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

కొడంగల్‌లో 81 వేల ఓట్లు..

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని .....

2

ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

ప్లకార్డులు తెస్తే సహించేది లేదని స్పీకర్ వార్నింగ్

- వాడీవేడీ వాతావరణం మధ్య ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
- వందేమాతరం పూర్తి చరణాలను ఆలపించిన సభ్యులు
- 22-ఏపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న స్పీకర్



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు వాడీవేడి వాతావరణం నడుమ ప్రారంభమయ్యాయి. సభ ఆరంభంలో జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి 6 చరణాలను సభ్యులందరూ భక్తిశ్రద్ధలతో ఆలపించారు. అనంతరం స్పీకర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ సభా ప్రాంగణంలోకి ఎవరూ ప్లకార్డులు, నిరసన పత్రాలు తీసుకు రావడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పక్ష సభ్యులు ఎవరైనా ప్లకార్డులు తెస్తే, వాటిని వెంటనే మార్షల్స్‌కు అప్పగించాలని సూచించారు. సభ సమగ్రతను, మర్యాదను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

2

ఇది దుశ్శాసన సభ

మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా? - కేటీఆర్

- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ



నిత్యం నిఘా, హైదరాబాద్ : ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు....

2

ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు : సబితా ఇంద్రారెడ్డి

- మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారన్న సబిత
- కేటీఆర్ అడ్డుకోకపోయి ఉంటే అక్కడే పడేసి తొక్కేసే వారని ఆవేదన
- హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు



2

నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..

నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది - ఎమ్మెల్సీ తాతా మధు



అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు

స్పీకర్ స్థానంపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య

తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధు

నిత్యం నిఘా, హైదరాబాద్ : అసెంబ్లీ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మధు చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో తాతా మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి లను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల,.....

2

నేడు తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన
- మంగళవారం బంద్‌కు పిలుపు నిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం
- వేల కోట్ల బకాయిలతో జీతాలు చెల్లించ లేకపోతున్నామని యాజమాన్యాల ఆవేదన



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజ మాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వ– హిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే..

2

గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం



- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

2

తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు



అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ

2

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం

నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు.. పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

- అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ శాసన సభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 2

తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపుకు కుట్ర - సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి.. ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

సారంపల్లి సేవలు చిరస్మరణీయం

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

- ప్లకార్డులు తెస్తే సహించేది లేదని స్పీకర్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న సెక్షన్ 22-ఏ నిషిద్ధ భూముల వ్యవహారంపై సభలో చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో స్పీకర్ కీలక ప్రకటన చేశారు. శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (BAC) సమావేశంలో చర్చించిన తర్వాతే 22-ఏ అంశంపై సభలో ఏ విధంగా చర్చ చేపట్టాలనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నియమావళికి లోబడి ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇస్తూనే... సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పీకర్ స్పష్టం చేశారు.

ఇది దుశ్శాసన సభ

మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా? - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

నేడు తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

మొదటిపేజీ తరువాయి.. స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.

నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..

నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది - ఎమ్మెల్సీ తాతా మధు

మొదటిపేజీ తరువాయి.. ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. "పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అధికార ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు, సవాల్‌లతో అసెంబ్లీ ప్రాంగణంలో పొలిటికల్ హీట్ మరింత రగిలింది.



ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు

- సబితా ఇంద్రారెడ్డి

మొదటిపేజీ తరువాయి.. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.



గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్.. బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి.. వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

అసెంబ్లీలో ఊహించని పరిణామం..

కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.



అసెంబ్లీలో రచ్చ.. బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22-ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో సభాప్రాంగణంలోకి దూసుకెళ్లారు. స్పీకర్ కల్పించుకుని... బీఏసీ సమావేశంలో చర్చించి 22-ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. మరోవైపు, బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. aమరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22-ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.



Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 3

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



హన్మకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా విద్యాశాఖకు ప్రత్యేకంగా పూర్తిస్థాయి మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఏబీవీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేష్ విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ సెకండ్‌గేట్ వద్ద ఏబీవీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ఆ పార్టీకి మద్దతు ఇచ్చారని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఎన్నికల హామీల మేరకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే విద్యార్థి లోకాన్ని ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నరేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, కేయూ విద్యార్థులు, ఏబీవీఎస్ఎఫ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

9న వరంగల్ జిల్లా స్థాయి యోగా పోటీలు



వరంగల్, సెప్టెంబర్ 7 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న బుధవారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కే. చంద్రశేఖర్ ఆర్య, అధ్యక్షుడు బొలిశెట్టి కమలాకర్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న ఉదయం 8 గంటలకు ఓ సిటీ స్టేడియంలో వివిధ విభాగాల్లో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 8 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు, పురుషులు, మహిళలకు వేర్వేరు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు నిర్ధారణకు సంబంధించిన గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీని తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం బొలిశెట్టి కమలాకర్ – 9502002308, పాకాల రవీందర్ – 8555859650 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సోమేశ్వర ఆలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన, చండీ యాగం



జనగామ జిల్లా/ పాలకుర్తి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష బిల్వార్చన, తులసి అర్చన, కుంకుమార్చన, చండీ యాగం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వదళాలతో స్వామివారికి వైభవంగా బిల్వార్చన చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ చండీ యాగాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, అర్చకులు డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, దేవగిరి సంతోష్, శ్యామ్‌తో పాటు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడి కుటుంబానికి అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆర్థిక సాయం



వరంగల్ , సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): రంగసాయిపేటకు చెందిన అయ్యప్ప భక్తుడు, అయ్యప్ప సేవా పరపతి సంఘం సభ్యుడు పాలకుర్తి శ్రీనివాస్ (లడ్డు శీను) మృతి చెందడం బాధాకరమని సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద అన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద సభ్యులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా యోగానంద మాట్లాడుతూ.. స్వతంత్ర భారతంలో చావు కూడా ఒక పెళ్లి లాంటిదే బ్రదర్ అంటూ శ్రీశ్రీ రాసిన కవితలో పేర్కొన్నట్లుగా, నేటి సమాజంలో అంత్యక్రియలు కూడా ఖర్చుతో కూడుకున్నవిగా మారాయని అన్నారు. ఇలాంటి సమయంలో పరపతి సంఘాలు తమ సభ్యుల కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తూ ఆర్థికంగా అండగా ఉండటం అభినందనీయమన్నారు. సభ్యుల కష్టసుఖాల్లో సంఘాలు భాగస్వాములై అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనుమాండ్ల రమేష్, నంద రమేష్, కత్తి ఎల్లాగౌడ్, కొల్లూరి శ్రీనివాస్, బజ్జూరి వీరేశం, దామరకొండ కరుణాకర్, పోశాల మల్లికార్జున్, పాల రంజిత్, శంకేసి శ్రీనివాసమూర్తి, సోమ అనిల్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- హన్మకొండలో దేవనపల్లి కవిత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



హన్మకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ (టీఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవనపల్లి కవిత ఆధ్వర్యంలో హన్మకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. హన్మకొండ సక్కలగుట్టలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ర్యాలీకి తరలివచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని, కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దేవనపల్లి కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడటం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ల్యాబ్‌లకు ఆధునిక పరికరాలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, వివిధ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం చలో అసెంబ్లీ



హన్మకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపు మేరకు విద్యార్థుల సమస్యలపై నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన ప్రదీప్‌రావును పోలీసులు ముందస్తుగా ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న నాయకులను ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటాలను ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆపలేరని, విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని ప్రదీప్‌రావు స్పష్టం చేశారు.

మట్టి గణపతినే ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



హన్మకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా నిర్వహించేందుకు హనుమకొండ జిల్లా యంత్రాంగం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'మట్టి గణపతిని పూజిద్దాం–పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే సందేశంతో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ రవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారు చేసిన విగ్రహాలు, రసాయన రంగుల వినియోగం వల్ల నీటి వనరులు, భూమి కలుషితమై పర్యావరణానికి, జలచరాలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. పీఓపీ విగ్రహాలకు దూరంగా ఉంటూ సంప్రదాయ బద్ధంగా మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ పండుగలను పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. మట్టి గణపతి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 4

భక్తులకు తాగునీరు అందించిన విద్యార్థులు



హన్మకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ జాతర సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హైస్కూల్ విద్యార్థులు సేవా కార్యక్రమం నిర్వహించారు. జాతరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు విద్యార్థులు తాగునీరు అందిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా విద్యార్థులు భక్తులకు నీటిని అందించారు. దాహంతో ఉన్న వారికి స్వయంగా తాగునీరు అందిస్తూ క్రమశిక్షణతో సేవలందించడం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థుల సేవా స్ఫూర్తిని భక్తులు, స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్‌రావు మాట్లాడుతూ.. రత్నగిరి జాతరలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో సేవాభావం, మానవతా విలువలు, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠ్యపుస్తకాల ద్వారా విద్యను అందించడంతో పాటు ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన, సేవా దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందితే వారు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. రత్నగిరి జాతర వంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారిలో సామాజిక బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల రాకపోకలకు సహకరించిన డ్రైవర్లు శ్రీనివాస్, కిరణ్, సంపత్, రాకేష్, వివేక్ తదితరులు సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై స్పందించాలి
- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్





కరీంనగర్/ జమ్మికుంట, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల కార్యక్రమంలో భాగంగా సోమవారం జమ్మికుంటలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పేదలు, రైతులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా చివరి రోజు మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి, అమలుకు చొరవ చూపాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఎంఆర్వో, మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, హామీలు అమలయ్యే వరకు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

420 హామీలు.. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?



పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంథని మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి సుమారు వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా మంథని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 420 హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా, వాటిని ఆచరణలోకి తీసుకువచ్చి ప్రజలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా 'హామీలు అమలు చేయాలి.. ప్రజలకు న్యాయం చేయాలి' అంటూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు.

6 గ్యారంటీలు.. 420 హామీలు వెంటనే అమలు చేయాలి





హన్మకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎల్కతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ సూచనతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ సర్పంచులు, యువజన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ప్రకటించి ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ స్పష్టమైన కార్యాచరణతో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మహేందర్ కోరారు. రైతుబంధు సకాలంలో అందక రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైన సమయంలో పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాగునీటిని సమర్థంగా వినియోగించాలి

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి వచ్చే నీటిని సమర్థవంతంగా వినియోగించి రైతుల పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. శ్రీరాంసాగర్, ఎల్ఎండీ తదితర ప్రాజెక్టుల్లో నీటిని అవసరమైన మేరకు నిల్వ చేసి, సాగుకు వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.

యూరియా కోసం రైతుల ఇబ్బందులు తొలగించాలి

యూరియా పంపిణీకి యాప్ అనుసంధానం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయడంతో పాటు రైతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. హామీల అమలు జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని పిట్టల మహేందర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మాజీ ఎంపీపీ మేకల స్వప్న సుదర్శన్, మాజీ వైస్ ఎంపీపీ తంగేడ నగేష్, మాజీ మండల అధ్యక్షులు ఏల్తూరి స్వామి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గొల్లే మహేందర్, గోడిశాల వినయ్‌కుమార్ గౌడ్, గుండేటి సతీష్‌నేత, సాతూరి శంకర్, మదార్, జూపాక జడ్సన్, చిట్టి గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన.. మంథని అభివృద్ధికి సరికొత్త బాట !





పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంథని ప్రధాన అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌పై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మంథని నియోజకవర్గంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆయనపై పుట్ట మధుకర్ పదేపదే విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శ్రీధర్‌బాబును విమర్శించడం మానుకోవాలని, రాజకీయంగా ఎదుర్కోవాలంటే ప్రజల మధ్యకు వచ్చి అభివృద్ధిపై మాట్లాడాలని హెచ్చరించారు.

అభివృద్ధి కనిపించడం లేదా?

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో మంథని పట్టణం రూపురేఖలు మారుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, అంబేద్కర్ ప్రధాన చౌరస్తా అభివృద్ధి, శాఖాహార–మాంసాహార మార్కెట్ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మంథని నిన్న ఎలా ఉంది, నేడు ఎలా మారుతోంది, భవిష్యత్తులో ఎలా ఉండబోతోందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులు కనిపిస్తున్నా కనిపించనట్లు వ్యవహరిస్తే ప్రజలు గుర్తిస్తారని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నత విద్యావంతుడని, రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు కాకుండా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజకీయ విలువలు, సంస్కారంతో వ్యవహరిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మంథనిని రాబోయే పుష్కరాల నాటికి మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆధునిక మౌలిక వసతులు కల్పించి మంథనిని సుందర పట్టణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.

పనులతోనే సమాధానం

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచుతున్నామని నాయకులు తెలిపారు. విమర్శలకు సమాధానం మాటలతో కాకుండా అభివృద్ధి పనులతోనే ఇస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎవరు ఏం చేశారో, ఎవరు ఏం మాట్లాడారో మంథని ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. కేవలం ఆరోపణలు, విమర్శలతో ప్రజలను నమ్మించలేరని, అభివృద్ధికి ప్రజలు మద్దతుగా నిలుస్తారని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంథని మండల సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 5

తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి



వరంగల్, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వరంగల్‌లో ఆందోళన చేపట్టాయి. టీపీసీసీ ఆదేశాల మేరకు పోచమ్మ మైదాన్ సెంటర్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా రాజ్యాంగ బద్ధమైన పదవిలో కొనసాగుతుండగా, ఆయనపై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ నాయకులు, అదే దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్నత పదవిలో కొనసాగడాన్ని జీర్ణించుకోలేక ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి అహంకారానికి నిదర్శనమని అయూబ్ విమర్శించారు. ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని అయూబ్ స్పష్టం చేశారు. తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ చర్యలు తీసుకోవడంతో పాటు స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, టౌన్, డివిజన్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

- ఏటూరునాగారంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



ఏటూరునాగారం, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా సోమవారం ఏటూరునాగారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ.. శాసనసభలో ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తమ వైఫల్యాలు అసెంబ్లీలో బయటపడతాయనే భయంతోనే ప్రతిపక్ష నాయకులను సభలోకి రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం వాటి అమలును గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేసి, ఇప్పటికైనా ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని హామీల అమలుపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు గడదాసు సునీల్‌కుమార్, తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్‌గౌడ్, కాకులమర్రి ప్రదీప్‌రావు, జిల్లా నాయకులు పోరిక గోవింద్‌నాయక్, తాటి కృష్ణ, భూక్య జంపన్న, ఎండీ. వలీబాబా, తాడూరి రఘు, సర్పిడి రాంనర్సయ్య, కర్ర రవీందర్, సయ్యద్ సర్దార్‌పాషా, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, దొడ్డ కృష్ణ, కావిరి చిన్నికృష్ణ, వావిలాల పోశయ్య, వావిలాల ముత్తయ్య, వావిలాల రాంబాబు, కొండాయి చిన్ని తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

ఇందిరమ్మ పాలన కాదు.. ఎమర్జెన్సీ రోజులు కనిపిస్తున్నాయి



పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న ఇందిరమ్మ పాలనలో ప్రజాస్వామ్య విలువలు కనుమరుగవుతున్నాయని, నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను తలపించేలా పాలన సాగుతోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రశ్నిస్తారనే భయంతోనే వారిని అడ్డుకుని అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడం, మహిళా నేతలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మంథని పాత పెట్రోల్ బంక్ సమీపంలోని పెద్దపల్లి–కాటారం ప్రధాన రహదారిపై నిర్వహించిన ధర్నాలో పుట్ట మధూకర్ మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల తరఫున ప్రశ్నించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. మహిళా నేతలను సైతం చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటని విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని, 420 హామీలను ఐదేళ్లలో నెరవేరుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలపై డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు ప్రజలు భయపడుతున్నారని, ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని పుట్ట మధూకర్ ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు, కార్యకర్తల వ్యవహారాలపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీ కేంద్రంగా పనిచేసే పార్టీలని విమర్శించిన ఆయన.. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన విధంగా పనిచేయడం లేదన్నారు. రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కళ్లు తెరవాలని పుట్ట మధూకర్ సూచించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నా బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని, గడపగడపకు వెళ్లి ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గవిచర్ల పాఠశాలలో ఘనంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన





వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 7 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. క్రీస్తుశేషులు గూడ లక్ష్మి మల్లారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, రామనర్సమ్మ దంపతులు సొంత ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి సరస్వతీ దేవి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ భాషిపాక సదయ్య హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సదయ్య మాట్లాడుతూ.. విద్యాదేవత సరస్వతీ దేవి విగ్రహాన్ని పాఠశాలలో ప్రతిష్ఠించడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు జ్ఞాన సముపార్జన పట్ల ఆసక్తి పెరుగుతుందని అన్నారు. పాఠశాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గూడ సంపత్‌రెడ్డి, రామనర్సమ్మ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అచ్చ నాగరాజు, మాజీ సర్పంచ్ భాషిపాక యాకూబ్, గ్రామ పెద్దలు లింగాల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి



వరంగల్/ సంగెం, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సంగెం మండల ఎంపీడీవో, ఎమ్మార్వోలకు వినతిపత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాలతో జిల్లా నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలను ప్రకటించి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంగెం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్



నిజామాబాద్ జిల్లా/ పోతంగల్, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : పోతంగల్ మండల కేంద్రంలోని హడుకో కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ జయశ్రీ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, పండ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో వివిధ రకాల పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. వాటి పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను సూపర్వైజర్ వెంకన్న రమణమ్మ వివరించారు. చిన్నారులకు బాల్యం నుంచే పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయమ్మ హైమద బేగం, పోతంగల్ బీసీ కాలనీ అంగన్వాడీ టీచర్ జ్యోతి, హంగర్గ ఫారం అంగన్వాడీ టీచర్ ద్రౌపతి, ఆశా వర్కర్ పద్మ, చిన్నారులు, తల్లులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 6

వాజేడు మండలంలోని గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి







ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) :
ములుగు జిల్లా వాజేడు మండలంలోని చింతూరు, ధర్మవరం, అయ్యవారిపేట గ్రామ పంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రజా పోరాట సమితి నాయకులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రహదారులు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, పాఠశాలల భద్రత తదితర సమస్యలతో ప్రజలు కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలను పలుమార్లు అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ధర్మవరం నుంచి చెరుకూరుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ధర్మవరం–చింతూరు పంచాయతీల మధ్య ఉన్న లక్ష్మీపురం–భువనపల్లి రహదారితో పాటు ధర్మవరం మెయిన్ రోడ్డు నుంచి భువనపల్లి వరకు ఉన్న రహదారిని కూడా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ధర్మవరం–కడెకల్ రహదారిని నిర్మించి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ధర్మవరం హైస్కూల్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో జంతువులు పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్నాయని, విద్యార్థుల భద్రత కోసం వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. ధర్మవరం, అయ్యవారిపేట ఎంపీపీఎస్ పాఠశాలలకు సంబంధించిన భూములపై నెలకొన్న ఆక్రమణల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, పాఠశాల భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న పాఠశాల గేటును కూడా పునరుద్ధరించాలని కోరారు. చింతూరు పంచాయతీ పరిధిలోని కొరకల్, భువనపల్లి గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించకపోవడంతో దోమల బెడద పెరిగిందని, వెంటనే ఫాగింగ్ చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మవరం, అయ్యవారిపేట, చింతూరు పంచాయతీల పరిధిలోని పల్లె ప్రకృతి వనాలను పునరుద్ధరించి అభివృద్ధి చేయాలని కోరారు. మూడు పంచాయతీల డంపింగ్ యార్డుల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. డంపింగ్ యార్డుల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. ధర్మవరం గ్రామంలోని ఉప ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం చివరి దశకు చేరుకున్నందున మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న భవనాలను తొలగించి విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విద్యార్థుల భద్రత వంటి అంశాలు ప్రజల జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్నాయని ప్రజా పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తెబోయిన మహేందర్, గార రవికుమార్, గగ్గూరి నాగేంద్రబాబు, శ్రీనాథ్, సురేష్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డాక్టర్ హకీమ్



నిజామాబాద్/ పోతంగల్, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) :
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా తాను ఇచ్చిన హామీని డాక్టర్ హకీమ్ నెరవేర్చారు. పోతంగల్ మండలంలోని అన్ని గ్రామాల్లో మొదటగా ఆడపిల్ల జన్మించిన కుటుంబానికి రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తానని ప్రకటించిన ఆయన.. ఆ హామీలో భాగంగా సోమవారం తొలి ఆడబిడ్డకు నగదు, నూతన వస్త్రాలు అందజేశారు. పోతంగల్ మండల కేంద్రానికి చెందిన బొంబాయి దేవత–బబ్లు దంపతులకు జన్మించిన ఆడబిడ్డకు డాక్టర్ హకీమ్ తన చేతుల మీదుగా రూ.5 వేల నగదును అందించారు. పాపతో పాటు తల్లిదండ్రులకు నూతన వస్త్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ హకీమ్ మాట్లాడుతూ ఆడపిల్లల జననాన్ని ప్రోత్సహించడం, వారిపట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే తన లక్ష్యమని తెలిపారు. ఆడపిల్ల పుట్టడం కుటుంబానికి అదృష్టమని, ప్రతి ఒక్కరూ ఆడబిడ్డలను గౌరవించి వారికి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆడబిడ్డ జన్మించిన కుటుంబాన్ని ప్రోత్సహించిన డాక్టర్ హకీమ్‌ను స్థానికులు అభినందించారు. ఆడపిల్లల పట్ల ప్రేమ, గౌరవాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి



ఏటూరునాగారం, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) :
ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని, ఆదివాసీల హక్కులు, భూములు, విద్య, ఉద్యోగాలు, రాజ్యాంగ రక్షణలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టి, అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 17 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పటిష్టంగా అమలు చేయాలని, వారి భూహక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 244(1), ఆర్టికల్ 342, ఆర్టికల్ 19(e), ఐటీడీఏ బైలాస్, పీసా చట్టం, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతాలకు సంబంధించిన 29 శాఖల జీవోలకు చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసీలపై అటవీ శాఖ దాడులను నియంత్రించాలని, 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో కంపెనీల పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని అడ్డుకోవాలని కోరారు. సింగరేణిలో ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీల భూముల అన్యాక్రాంతాన్ని అడ్డుకుని, చట్టవిరుద్ధ భూకబ్జాలు, బదలాయింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల అధికారాలను గౌరవించి పీసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 1/70 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నత విద్యకు మరిన్ని అవకాశాలు కల్పించాలని, వైద్య, ఇంజినీరింగ్, న్యాయ, బీఈడీ, పీజీ తదితర కోర్సుల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టులు, ఇతర ఉపాధి అవకాశాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇసుక మాఫియా కారణంగా గోదావరి నది, భూగర్భ జలాలకు జరుగుతున్న నష్టాన్ని నియంత్రించాలని, ఆదివాసీ హక్కులకు సంబంధించిన చట్టాలు, జీవోలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తుడుం దెబ్బ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. 17 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, జాతీయ అధ్యక్షుడు కొట్నాక విజయి, ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు పొడెం బాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసే బాలకృష్ణ, పడిగ నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేఖ గణేష్, ములుగు జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కోరినబెల్లి గణేష్, రాష్ట్ర కార్యదర్శి సిద్దబోయిన కార్తీక్, ఉపాధ్యక్షుడు కబ్బాక లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు దబ్బకట్ల శ్రీకాంత్, ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు వట్టం సుభద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం చంటి తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్‌లో మోగిన గులాబీ రణభేరి!



నిజామాబాద్/ పోతంగల్, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) :
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన రణభేరి కార్యక్రమం సోమవారం పోతంగల్ మండల కేంద్రంలో హోరెత్తింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గులాబీ శ్రేణులు భారీ ర్యాలీ, ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నాయకులు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు గడిచినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని వారు ఆరోపించారు. “వంద రోజుల్లో స్వర్గం చూపిస్తామని చెప్పి.. వెయ్యి రోజుల్లో ప్రజలకు నరకం చూపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదు.. వెయ్యి రోజుల దగా” అంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

హామీలెక్కడ అంటూ బీఆర్ఎస్ నిలదీత

రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, రెండు లక్షల ఉద్యోగాల హామీల పరిస్థితి ఏమిటని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్ల జన్మించినప్పుడు తల్లీబిడ్డలకు అందిస్తామని ప్రకటించిన కానుకలు, వస్త్రాలు, కిట్, ఆర్థిక సహాయం తదితర హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ తెలంగాణ భవన్‌లో విడుదల చేసిన చార్జ్‌షీట్‌ను ప్రస్తావిస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మౌలిక వసతులు, సంక్షేమ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, కుంభకోణాలు, కమీషన్ల పాలన కొనసాగుతోందంటూ విమర్శించారు.

సంబరాలు అక్కడ.. వాస్తవాలు ఇక్కడ

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిందంటూ సంబరాలు నిర్వహిస్తుంటే క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా పాలనపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా హామీలను విస్మరిస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచి హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలకు ఇచ్చిన మాటే నాయకుడి బలమని పేర్కొన్నారు. పోతంగల్‌లో నిర్వహించిన ఈ గులాబీ రణభేరి కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూదం నవీన్, ఎం.ఏ. హకీమ్, నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారీ ర్యాలీ, ధర్నాతో బీఆర్ఎస్ శ్రేణులు తమ నిరసనను వ్యక్తం చేశారు.

త్రాగునీరు లేక మొగిలిచర్ల ప్రజల అవస్థలు



వరంగల్, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) :
గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ పరిధిలోని మొగిలిచర్ల గ్రామంలో వారం రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలో పర్యటించిన ఆయన తాగునీటి సమస్యను పరిశీలించి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడ్డారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న మొగిలిచర్లను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారని, ప్రస్తుతం ప్రజల నుంచి ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ కనీసం తాగునీటిని సక్రమంగా అందించలేకపోతున్నారని శివకుమార్ విమర్శించారు. సుమారు 5 వేల మంది జనాభా ఉన్న గ్రామంలో వారం రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేసవి కాలం రాకముందే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వేసవి ప్రారంభమైతే పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. తక్షణమే మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే మొగిలిచర్ల ఆడబిడ్డలు బిందెలతో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తారని శివకుమార్ హెచ్చరించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కుతో ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బిల్లా రమేష్, జిల్లా నాయకులు ఆడెపు రమేష్, కమగోని రఘుపతి, లెంకలపల్లి స్వామి, బిల్లా సదానందం, గబ్బటి శ్రీనివాస్, నరిశెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 7

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వాజేడు నాగారంలో ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వాజేడు మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. మండలంలోని ఐదు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీలను నాగారం గ్రామపంచాయతీ సర్పంచ్ బోదెబోయిన స్వరూప ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండ కృపాకర్‌రావు, మండల విద్యాధికారి తేజావత్ వెంకటేశ్వర్లు, నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలస్థాయి పోటీల్లో



ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

హనుమకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, డీఆర్డీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో మండలాల వారీగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లుల రికార్డు ప్రక్రియను పూర్తి చేసి చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇంకా అభివృద్ధి పనులు అవసరమైన గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగు



ణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డీఈలు రాజగోపాల్‌రావు, శ్రీనివాస్‌రావు, శిరీష, యుగంధర్, రామ్‌దేవ్ అగర్వాల్, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీవి బూటకపు మాటలే

జనగామ జిల్లా / పాలకుర్తి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ బూటకపు మాటలేనని, 420 హామీలతో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో మహిళలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రతి ఒక్కరికి లక్ష రూపాయలు బాకీ ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమే నని విమర్శించారు. 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, హామీలు నెరవేర్చని కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ హయాంలో పాలకుర్తి అభివృద్ధి

తన హయాంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని ఎర్రబెల్లి తెలిపారు. పాలకుర్తి సోమనాథ ఆలయం, బమ్మెర పోతన, వల్మీడి దేవస్థానాల అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. పాలకుర్తి నుంచి అన్ని వైపులా డబుల్ రోడ్లు నిర్మించిన ఘనత తనదే నని అన్నారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధి తండాలను గ్రామపంచాయతీలుగా మార్చారని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే ముందువరుసలో



నిలిపామని అన్నారు. అభివృద్ధి పేరుతో కమీషన్ల కోసం రాష్ట్రాన్ని కాంగ్రెస్ నాయకులు దోచుకుంటున్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

"కబర్దార్ రేవంత్‌రెడ్డి.. చేసిన తప్పులకు అన్ని వడ్డీలతో సహా సమాధానం చెబుతాం" అని ఎర్రబెల్లి హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు దుర్మార్గం

హనుమకొండ / హసన్‌పర్తి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ఈ వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించి తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల అధ్యక్షుడు రేణిగుంట్ల అశోక్, డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, పుట్ట తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌పై బాధ్యతారహితంగా, అవమానకరంగా వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ నేతల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌తో పాటు తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాదని, శాసనసభ గౌరవాన్ని, రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ శాసనసభ స్పీకర్‌గా కొనసాగుతుండగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా ఉండటం, మరోవైపు బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం విరుద్ధమైన వైఖరికి నిదర్శనమని ఇనగాల



విమర్శించారు. తాతా మధుపై బీఆర్ఎస్ అధిష్ఠానం తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆయనను సస్పెండ్ చేయడంతో పాటు ఎమ్మెల్సీ సభ్యత్వంపై చర్యలు తీసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేలా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బాలమంచ్ అధ్యక్షుడు జిన్న పురెడ్డి రుగ్వేద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కిరణ్, సురేందర్‌రెడ్డి, ఐలయ్య, డీసీసీ నాయకులు బుచ్చిరెడ్డి, రవీందర్, మధు, సురేష్, రాజు, వెంకన్న, మహిళా నాయకురాలు పల్లేపు అనూష తదితరులు పాల్గొన్నారు.

గద్వాల విజయలక్ష్మికి ఎర్రబెల్లి స్వర్ణ శుభాకాంక్షలు



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన గద్వాల విజయలక్షి ని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో గద్వాల విజయలక్షి విజయవంతంగా రాణిస్తూ రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని ఎర్రబెల్లి స్వర్ణ ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికా బోర్డు ద్వారా మరింత సమర్థవంతంగా పనిచేయాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

భూపాలపల్లి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 18 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఆయన.. సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.



పండగలు, జాతరల్లో పోలీసుల వ్యవహారశైలిపై శిక్షణ

వరంగల్, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : పండగలు, జాతరలు, ఊరేగింపుల సందర్భంగా భారీగా తరలివచ్చే ప్రజలతో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై పోలీస్ శిక్షకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో భద్రాద్రి జోనల్ పరిధిలోని పోలీస్ శిక్షకులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 43 మంది పోలీస్ శిక్షకులు ఈ శిక్షణకు హాజరయ్యారు. పండగలు, జాతరలు, ఊరేగింపుల సమయంలో భారీ జనసమూహాలను



నియంత్రించడంతో పాటు ప్రజలతో పోలీసులు మర్యాదపూర్వకంగా, సంయమనంతో వ్యవహరించాల్సిన విధానంపై శిక్షణ ఇస్తున్నారు. తరగతి గదుల్లో బోధనతో పాటు ప్రాక్టికల్ విధానంలోనూ వివిధ పరిస్థితులను వివరించి శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న పోలీస్ శిక్షకులు తమ తమ జిల్లాల పోలీస్ యూనిట్లలోని అధికారులు, సిబ్బందికి ఇదే తరహాలో శిక్షణ ఇవ్వనున్నారు. పండగలు, జాతరలు, ఊరేగింపుల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, సీటీసీ ఏసీపీ రమణబాబు, ఆర్ఐలు సింహాచలం, శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్‌తో పాటు శిక్షణ కేంద్రానికి చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 8

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం



జనగామ జిల్లా / పాలకుర్తి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లతో పాలకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సుమారు 50 మంది మండపాల నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్ లేదా నిర్దేశిత విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, మండపాల వద్ద కనీసం ముగ్గురు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గణేష్ ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే నిమజ్జనం తేదీ, ప్రదేశం వివరాలను నమోదు చేయాలని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ డీజే ఆపరేటర్లు, నిర్వాహకులు పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. మండపాల వద్ద విద్యుత్, అగ్నిమాపక భద్రత, తగిన లైటింగ్‌తో పాటు భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రజల మధ్య వివాదాలు లేదా మత విద్వేషాలకు దారితీసే నినాదాలు, ప్రసంగాలు, కార్యక్రమాలకు తావివ్వరాదని పోలీసులు సూచించారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

తాడ్వాయిలో గులాబీ దండు నిరసన జ్వాలలు



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తదితర ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ తాడ్వాయి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. మండల పార్టీ అధ్యక్షుడు దొండగల మల్లయ్య ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దొండగల మల్లయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అన్యాయాన్ని ప్రశ్నించే హక్కును రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిందన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల గొంతును వినిపించేందుకు నల్ల దుస్తులతో నిరసన తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను దౌర్జన్యంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా అవమానించారని ఆరోపిస్తూ, ప్రభుత్వ తీరును ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కాటాపురం సర్పంచ్, సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యమాలతో పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, అరెస్టులు తమకు కొత్త కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ ముండ్రాతి రాజమౌళి మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను దౌర్జన్యంగా అరెస్టు చేయడం అమానుషమని విమర్శించారు. ఈ చర్యలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొండగల మల్లయ్య, కాటాపురం సర్పంచ్ మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ ముండ్రాతి రాజమౌళి, దానిక నర్సింగరావు, మాజీ ప్రధాన కార్యదర్శి వహీద్, సీనియర్ నాయకులు ఎన్నింటి యాదిరెడ్డి, పత్తి గోపాల్‌రెడ్డి, బంజర తిరుపతి, రఫీక్, ప్రధాన కార్యదర్శి పోవు నగేష్, మాజీ సర్పంచ్ శివరాజ్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాతా మధును వెంటనే భర్తరఫ్ చేయాలి



హనుమకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరూరి సాంబయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన శాసనసభ స్పీకర్ పదవిని, స్పీకర్ చైర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని మండిపడ్డారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీని వెంటనే భర్తరఫ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు సుబేదారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎమ్మెల్సీ తాతా మధుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థలను అవమానించే వ్యాఖ్యలను ఏట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మేర సంఘం చైర్మన్ వెంకటరాజం, ఎనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక అనిల్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, లీగల్ సెల్ చైర్మన్ తోట రాజ్ కుమార్, మైనారిటీ సెల్ చైర్మన్ అజీజ్ ఉల్లా బేగ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు కూర వెంకట్, మీడియా సెల్ ఇన్‌చార్జి మార్క విజయ్, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, బోడ దిన్న, నసీం జహాన్, నాయకులు అంబేద్కర్ రాజు, అంకుస్, కార్తీక్, సమత, రహీమున్నీసా, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరు

వరంగల్ / నర్సంపేట, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై జరిగిన పోలీసుల చర్యలు, తోపులాట ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నర్సంపేట డివిజన్ కోఆర్డినేటర్, ఖానాపురం మాజీ ఎంపీపీ, మాజీ సొసైటీ చైర్మన్ తక్కలపల్లి రవీందర్ రావు అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఏళ్ల పాటు ఉద్యమించి, అనేక త్యాగాలు చేసిన ఉద్యమకారుల వారసత్వాన్ని మోస్తున్న ప్రజా ప్రతినిధులు అదే తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద అవమానానికి గురికావడం బాధాకరమని పేర్కొన్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులు నల్ల టీ-షర్టులతో నిరసన వ్యక్తం చేస్తూ అసెంబ్లీకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడం, తోపులాట జరగడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ గేటు వద్దే అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ఏ సందేశం ఇస్తోందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చించాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం సరికాదన్నారు. ముఖ్యంగా మహిళా ప్రజా ప్రతినిధులు ఉన్న సమయంలో తోపులాట జరగడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ప్రతి ప్రజా ప్రతినిధికి ఉందని స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే శాశ్వతమని రవీందర్ రావు అన్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్-రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులపై జరిగిన చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, నర్సంపేట డివిజన్ తరపున బీఆర్ఎస్ పోరాటానికి సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రజల గొంతుకను అణచివేయడం



ద్వారా సమస్యలు పరిష్కారం కావని, హామీలను అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

వరంగల్/ సంగెం, సెప్టెంబర్ 7 (నిత్యం నిఘా ప్రతినిధి) : గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని పర్వతగిరి సీఐ సంతోష్ సూచించారు. సోమవారం సంగెం రైతు వేదికలో గణేష్ ఉత్సవ నిర్వాహకులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, యువతతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సంగెం ఎస్ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సీఐ పర్వతగిరి సంతోష్ హాజరై ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, ప్రతి గణేష్ మండపం వద్ద విద్యుత్, భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఏసీపీ సూచనల మేరకు ఒక బాక్స్, ఒక మైక్‌కు మాత్రమే అనుమతి తీసుకుని, నిర్ణీత చలాన్ మొత్తాన్ని మీ-సేవా ద్వారా చెల్లించాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద ప్రతిరోజూ కనీసం ఇద్దరు నిర్వాహకులు భద్రత, పర్యవేక్షణ కోసం అందుబాటులో ఉండాలని తెలిపారు. చైన్ స్నాచింగ్, మహిళల పట్ల వేధింపులు తదితర ఘటనలను నివారించేందుకు సోలార్ పవర్‌తో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి గ్రామ సర్పంచులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, గ్రామంలోని గణేష్ విగ్రహాలన్నింటినీ మండల స్థాయిలో ఒకే నిర్ణీత రోజున నిమజ్జనం చేసేలా సమన్వయం చేసుకోవాలని సీఐ సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని రాత్రి 10 గంటలలోపు పూర్తి చేయాలని తెలిపారు. డీజేలకు బదులుగా బ్యాండ్, కోలాటం, గుస్సాడి నృత్యం, డప్పులు, బొమ్మల ప్రదర్శనలు వంటి



సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని నిర్వాహకులను కోరారు. నిమజ్జన కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలీసులకు పూర్తిగా సహకరించాలని సీఐ పర్వతగిరి సంతోష్ కోరారు. సమావేశంలో సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గణేష్ విగ్రహ నిర్వాహకులు, ముఖ్య నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

Nityam Nigha 08.09.26_Layout 1 9/8/2026 7:51 AM Page 9

అరెస్టులతో బీజేపీ గొంతు నొక్కలేరు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం 'చలో అసెంబ్లీ'కి బయలు దేరితే ముందస్తు అరెస్టులు
- కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి భయపడేది లేదు - ఉద్యమం ఆపేది లేదు
- బీజేపీ మండల అధ్యక్షుడు అడప రాజు



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నేపథ్యంలో వర్ధన్నపేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీకి బీజేపీ శ్రేణులు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు అడప రాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముందస్తు అరెస్టులపై అడప రాజు తీవ్రంగా మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో బీజేపీ గొంతును నొక్కలేరని, కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి, పోలీసుల అరెస్టులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన చేపడుతుంటే ముందస్తు అరెస్టులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడ మేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులను అరెస్టు చేసినంత మాత్రాన విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావని, ఫీజు బకాయిలు విడుదలయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడటం నేరమా? ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయడం ఎంతవరకు సమంజసం?" అని అడప రాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు, పోలీసుల అరెస్టులకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండేటి సత్యం, రాయపురపు కుమారస్వామి, మల్లెపాక అనిల్, గిరిబాబు, తేజ నాయక్, దేవేందర్, సుంకరి బాబు, ఎల్లస్వామి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. తాతా మధుపై ఫిర్యాదు!


- శాసనసభ గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఆగ్రహం



హనుమకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శాసనసభ స్పీకర్ పదవి గౌరవాన్ని, ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ సోమవారం హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మని శేఖర్‌రావు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు స్థానం ఉన్నప్పటికీ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులపై వ్యక్తిగతంగా, అనుచితంగా వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. శాసనసభ స్పీకర్ పదవి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డం విష్ణు ప్రసాద్, పోలేపాక బుచ్చిరెడ్డి, రఫీ, పాషా, నాయిని లక్ష్మారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అన్నారంలో దొంగల బీభత్సం

- ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం, వెండి, నగదు అపహరణ
- 67 ఏళ్ల వృద్ధుడి ఇంటిని టార్గెట్ చేసిన గుర్తుతెలియని దుండగులు



వరంగల్ / పర్వతగిరి, సెప్టెంబర్ 7 (నిత్యం నిఘా ప్రతినిధి) : పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నారం గ్రామంలో చోరీ ఘటన కలకలం రేపింది. ఇంటి యజమాని లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన నెలకొంది.అన్నారం గ్రామానికి చెందిన సముద్రాల మైసయ్య (67), తండ్రి మల్లయ్య ఇంటిని దుండగులు లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు 2 గ్రాముల ముక్కుపుడక, వెండి కుంకుమ భరణి, సుమారు 20 తులాల వెండి పళ్లెం, ఒక తులం బంగారు లక్ష్మీదేవి బిళ్లలు, రూ.9 వేల నగదు, వెండి డబ్బా, రెండు తులాల వెండి బిళ్ల తదితర వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.విలువైన వస్తువులు చోరీకి గురికావడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. చోరీ పగటిపూట జరిగిందా.. రాత్రి సమయంలో జరిగిందా? దుండగులు ఏ మార్గంలో వచ్చారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.బాధితుడి ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగల ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వివరాలు సేకరిస్తూ, అనుమానితుల కదలికలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. గ్రామంలో చోరీ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస చోరీల నేపథ్యంలో గ్రామాల్లో పోలీసుల నిఘాను మరింత పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికల హాస్టల్‌లో దారుణ పరిస్థితులు

- నీటి సౌకర్యం లేక మూడో అంతస్తుకు బకెట్లతో నీటి మోత
- వార్డెన్ వేధింపులపై విద్యార్థినుల ఆందోళన
- తాగునీరు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఏటూరునాగారం, సెప్టెంబర్07 (నిత్యం నిఘా ప్రతినిధి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో కనీస మౌలిక సదుపాయాలు సరిగా లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హాస్టల్‌లో నీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో మూడో అంతస్తు వరకు బకెట్లతో నీటిని మోసుకెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు తెలిపారు. హాస్టల్‌లోని బాత్రూమ్‌లు, మరుగుదొడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని వారు ఆరోపించారు. ఈ సమస్యలను వార్డెన్ దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించినప్పుడు తమను బూతులు తిడుతూ వేధిస్తున్నారని, దాడికి ప్రయత్నిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు.

*** సమస్యలపై విద్యార్థినుల ఆందోళన**

హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని, నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో కొందరు టీచర్లు విద్యార్థినులను తిరిగి గదుల్లోకి పంపి మీడియాతో మాట్లాడకుండా అడ్డుకున్నారని కూడా ఆరోపణలు వినిపించాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

*** అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి**

బాలికల హాస్టల్‌లో తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల నుంచి వచ్చిన వార్డెన్‌పై వేధింపుల ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను దృష్టిలో ఉంచుకుని హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి పరిస్థితులను పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కనీస వసతుల కోసం బాలికలు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి కదిలిన ఇరిగేషన్ అధికారులు

- పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన.. అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్ల తయారీ
- కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, బ్రిడ్జిల సమస్యలపై దృష్టి



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 07 , (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యల పరిష్కారానికి ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, బ్రిడ్జిలకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు. అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటికి సంబంధించిన ఎస్టిమేషన్లు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టారు.

*** కేశపూర్‌లో పెద్ద చెరువు కాలువ పరిశీలన**

కేశపూర్ గ్రామంలోని పెద్ద చెరువు ఇరిగేషన్ ఛానల్‌ను అధికారులు పరిశీలించారు. గతంలో ఈ కాలువకు సంబంధించి రూపొందించిన ప్రతిపాదనపై వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం కాలువలో జంగిల్ పెరగడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్న పరిస్థితిని పరిశీలించి, అవసరమైన పనులకు సంబంధించి తాజా ప్రతిపాదన సిద్ధం చేసి ఎస్టిమేట్ పంపేందుకు చర్యలు చేపట్టారు.

*** దండేపల్లిలో పలు పనుల గుర్తింపు**

దండేపల్లి గ్రామంలోని ఊర చెరువు మార్గంలో జంగిల్ అధికంగా పెరిగిన ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ఎస్టిమేషన్ రూపొందించారు. అలాగే తుర్కపల్లి నుంచి ఊర చెరువు మత్తడి వరకు చెరువులోకి వెళ్లేందుకు అవసరమైన పనులను కూడా పరిశీలించి ఎస్టిమేట్ సిద్ధం చేశారు.

*** ఎల్కతుర్తిలో నూతన బ్రిడ్జికి ఎస్టిమేషన్**

ఎల్కతుర్తి గ్రామంలో అనంతసాగర్ వాగు నుంచి ఊర చెరువుకు వచ్చే కాలువను అధికారులు పరిశీలించారు. కాలువపై గతంలో ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో.. దాని స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పనులను గుర్తించి ఎస్టిమేషన్ రూపొందించారు.

*** గోపాల్‌పూర్‌లో చెక్‌డ్యామ్ పనుల పరిశీలన**

గోపాల్‌పూర్ గ్రామంలో చెక్‌డ్యామ్‌కు సంబంధించిన పనులను ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. చెక్‌డ్యామ్ పరిధిలో చేపట్టాల్సిన అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటికి సంబంధించిన ఎస్టిమేషన్‌ను తయారు చేశారు.

*** నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి**

ఈ పనులు పూర్తయితే ఆయా గ్రామాల్లో సాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, బ్రిడ్జిల అభివృద్ధికి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభించాలని రైతులు కోరారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కరీంనగర్ సీఈ సత్యనారాయణ, ఎస్ఈ పల్లెం రాజు, హుస్నాబాద్ ఈఈ వెంకట కృష్ణారావు, ఎల్కతుర్తి డీఈ కవిత, ఏఈఈలు రవిచందురు, సామంతు ప్రత్యూష తదితర ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, ప్రజాప్రతినిధులు కూడా అధికారులతో కలిసి గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబనే
కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పాడి గేదెల పెంపకంతో కుటుంబ ఆదాయం పెంచుకోవాలి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- పరకాల ఇందిరా మహిళా డెయిరీతో రెండేళ్లలో 40 వేల కుటుంబాలకు సభ్యత్వం



వరంగల్, సంగెం/గీసుకొండ, సెప్టెంబర్ 07 (నిత్యం నిఘా ప్రతినిధి): దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గీసుకొండ మండలం కొనాయమాకుల రైతు వేదికలో సంగెం, గీసుకొండ మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు పాడి గేదెల యూనిట్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 167 యూనిట్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమానికి ముందు పశువైద్యులు లబ్ధిదారులకు పాడి గేదెల పెంపకంపై అవగాహన కల్పించారు. పశువులకు అందించాల్సిన పోషకాహారం, వ్యాధుల నివారణ, టీకాల ప్రాముఖ్యతతో పాటు వాతావరణ మార్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

*** నిరంతర ఆదాయానికి పాడి పరిశ్రమ**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. పాడి గేదెల పెంపకం ద్వారా నిరంతర ఆదాయం పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

*** రెండేళ్లలో 40 వేల కుటుంబాలకు డెయిరీ సభ్యత్వం**

పరకాల ఇందిరా మహిళా డెయిరీ ద్వారా రాబోయే రెండేళ్లలో 40 వేలకుపైగా కుటుంబాలను సభ్యులుగా చేర్చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబానికి రెండు పాడి గేదెలు అందించే దిశగా చర్యలు చేపడతామన్నారు.పాడి గేదెల పెంపకం కేవలం ఒక ప్రభుత్వ పథకంగా కాకుండా.. కుటుంబాలకు దీర్ఘకాలిక ఆర్థిక భరోసాను కల్పించే మార్గంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, యువజన నాయకులు, మహిళలు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.